ఎమ్మెల్సీ ఓటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండల కేంద్రంలోని స్థానిక జిల్లాపరిషత్ హై స్కూల్లో ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా వాటిలో వచ్చిన ఓటర్లకు మౌలిక సదుపాయాలు తహశీల్దార్ కిరణ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో యేజెంట్లుగా వుండే అభ్యర్దులు ఆదివారం 7 గంటలకు ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్దకు చేరాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా వుండేలా చూడాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఆయన వెంట యస్ఐ సైదులు, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖరెడ్డి, ఆర్ఐ ముకుందహరి, విఆర్ఓ వెంకటలక్ష్మి వున్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయితీగా ఓటు వేయండి

ఎమ్మెల్సీ అభ్యర్థి వీర భద్రాచారి ఓటర్లకు పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సోమవారం జరుగనున్న తూర్పు రాయల సీమ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో విద్యావంతులైన పట్ట భద్రులు నిజాయితీగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని, ప్రజల వాదాన్ని బలంగా విని పించాలని పట్టభద్రుల బహుజన అభ్యర్థి వీరభద్రాచారి పిలుపునిచ్చారు. శనివారం ఓటర్లను ప్రలోభ పెడుతూ డబ్బులు పంచుతామంటున్న అభ్యర్థులను ఓడించాలన్నారు. డబ్బులు పంచడం ప్రజాస్వామ్య ద్రోహమని, అలాగే సామాన్యుడికి ఓటు ఆయుధం కావాలి కానీ ఆదాయం కారాదన్నారు. ఓటర్లు చైతన్యంతో మద్దతుగా నిలవాలని వీర భద్రా చారి అభ్యర్థించారు. అనంతరం ఓటు ఆవశ్యకత పై ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు టి. వేంకటస్వామి, పేరం సత్యం, నాగరాజు, సంపత్ కుమార్, అజయ్ లు పాల్గొన్నారు.

టి.అరుణకు ఘన సత్కారం

విశాలాంధ్ర-ఒంగోలు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముంబైలోని ఆంధ్ర మహాసభ మహిళా శాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర మహాసభ కార్యాలయం ఆవరణలో శ్రీమతి తేళ్ల అరుణకు ఘనంగా సన్మానం జరిగింది. ఈ సభను మహిళా శాఖ అధ్యక్షురాలు లలితా బెహరా మరియు టి.అపరాజితలు నిర్వహించారు. అరుణ చేసిన సేవలను కొనియాడుతూ ఆమెను ఆంధ్ర మహాసభ సన్మానించడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నామని అన్నారు. ఈ సభలో అరుణ గారితో పాటు దేశంలోనే కొద్దిమంది ఆడవారైన హార్ట్ సర్జెన్సీలో ఒకరైన చందన ని తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు రామకృష్ణ దీక్షితులు భార్య అనూష ని, ఆంధ్ర మహాసభ మహిళా శాఖ విశ్రాంత అధ్యక్షురాలు అయిన వాణీ సుసర్ల ని కూడా సన్మానించారు. సభానంతరం జరిగిన సాంస్కృతిక కార్య క్రమాలు ప్రేక్షకుల్ని అలరించాయి. అధిక సంఖ్యలో బాంబే నలుమూలల నుంచి ఉన్న తెలుగు మహిళలు పాల్గొన్నారు..

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-పామూరు : శనివారం మండలంలో జరిగిన పలు వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ శాసన సభ్యులు, టిడిపి ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని బొట్లగూడూరులో కోటపాటి వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. పాటోలువారిపల్లెలో చీమలదిన్నె వెంగయ్య కుమారుడి వివాహ వేడుకల్లో డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట పారిశ్రామికవేత్త టిడిపి నాయకులు కోటపాటి జనార్ధన్, మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, మేడసాని రమణయ్య, సయ్యద్ అమీర్ బాబు, మన్నం రమణయ్య, గుంటుపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

యువత నూతన టెక్నాలజీ నేర్చుకోవాలి బానిస కాకూడదు

విశాలాంధ్ర-తాళ్లూరు : యువత నూతన టెక్నాలజీని నేర్చుకోవాలి కానీ దానికి బానిస కాకూడదని స్థానిక ఎస్సై బి ప్రేమ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరు లోని ఏబిసి హై స్కూల్ నందు శనివారం విద్యార్థులకు సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని ఆయన తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం పై అవగాహన కలిగి ఉండి వాటికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కలిగించి వారు కూడా వాటికి దూరంగా ఉండేటట్లు చేయాలని ఆయన తెలిపారు. యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తూము శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కే.వెంకటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ కాలేషాబాబు, మహిళా పోలీస్ భవాని, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలపైనే వైసీపీ గురి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేయాలని బెదిరింపులు!
- ఓటుకు రూ.5వేలు పంపిణీ
- వైసీపీ నాయకత్వం అంతా ఎన్నికలపైనే దృష్టి
- ముగిసిన ప్రచారం
- పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుకోసం అధికార పార్టీ వైకాపా సర్వ శక్తులొడ్డుతుంది. పీడీఎఫ్ అభ్యర్థులు గెలుపు ఖాయమని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వైకాపా బెదిరింపులకు తెరలేపింది. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులందరికీ ఓటు హక్కు కల్పించి వారికి ఒక్కొక్కరికి ఐదు వేల నుండి ఆపై డబ్బులు చెల్లిస్తూ ఓట్లు కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి వైకాపాపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో వైకాపా ప్రైవేటు విద్యాసంస్థలపైనే దృష్టి సారించింది. ఇప్పటికే ఓట్లు చేర్పింపుల్లో అక్రమాలకు పాల్పడ్డ ఆ పార్టీ ఇప్పుడు ఓట్లు కొనుగోళ్లు బహిరంగంగానే చేస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ పట్టభద్రుల ఎన్నికలు ఈ నెల 13న జరగనున్న విషయం విధితమే. దీనిలో భాగంగా శనివారం సాయంత్రానికి ఎన్నికల ప్రచారం కూడా ఎన్నికల ప్రచారం ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంఎల్‌సి ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సహజంగా ఉపాధ్యాయ పట్టభద్రులు ఎంఎల్‌సి ఎన్నికల్లో గత 50 సంవత్సరాల నుండి పీడీఎఫ్ (వామ పక్షాల అభ్యర్థులే) విజయం సాధిస్తున్నారు. అయితే ఈసారి వైకాపా ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో సామ దాన దండోపాయాలను ప్రయోగిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు అని నిరూపించు కునేందుకు ఎంఎల్‌సి ఎన్నికలు గెలుపే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను వదిలివేసి ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించి ఆ ఓట్ల ద్వారా గెలవాలని వైకాపా కుయుక్తులు పన్నుతుంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వైకాపా అభ్యర్థులకు ఓట్లు వేయకపోతే ఆ విద్యాసంస్థల లైసెన్సులను రద్దు చేస్తామని బెదిరిస్తున్నారు. ఓట్లు పోలయ్యే విధానం తెలుస్తుందని ముందుగానే హెచ్చరిస్తూనే మరోపక్క ఓటుకు ఐదు వేల నుంచి పది వేల వరకు ఉపాధ్యాయ ఓట్లను కొనుగోలు చేస్తున్నారు. పట్ట భద్రులకు మాత్రం ఓటుకు రెండు వేల రూపాయలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

దూర ప్రాంతాల ఓట్లపైనే పార్టీల దృష్టి

ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ పట్ట భద్రుల ఎన్నికలకు సంబంధించి ప్రచార ఘట్టం ముగిసింది. ఇక దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఈ నెల 13వ తేది ఓటింగ్‌కు పిలిపించుకునే పనిలో ప్రధాన రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా వైకాపా దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు ఐదు వేల నుంచి ఏడు వేలు డబ్బులు ఓటుకు ఇవ్వడంతో పాటు వచ్చి ఓట్లు వేసి వెళ్లేందుకు ట్రాన్స్‌పోర్ట్ డబ్బులు కూడా సమకూరుస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో డివిజన్‌ల వారీగా పట్టభద్రులు ఓట్లు ఎన్ని ఉన్నాయి, వీరు ఎక్కడున్నారు విచారించుకొని వారికి పార్టీల నాయకుల ద్వారా ఫోన్‌పేలో డబ్బులు పంపిస్తూ ఓటర్లను కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క తెలుగుదేశం పార్టీ కూడా ఎంఎల్‌సి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో వారి సానుభూతి పరులను కూడా ఓటింగ్‌లో పాల్గొనే విధంగా ట్రాన్స్‌పోర్టు సదుపాయం సమకూరుస్తున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపుకోసం బైక్ ర్యాలీ

పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు కాంక్షిస్తూ ఒంగోలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇప్పటికే వారి గెలుపు ఖాయమని తెలుస్తుంది. ఉపాధ్యాయులు ఎప్పటిలాగే ఈసారి కూడా పీడీఎఫ్ అభ్యర్థులు గెలుస్తారని వారే ప్రచారం చేస్తున్నారు. స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని యూటీఎఫ్ కార్యాలయం నుండి నగరంలోని ప్రధాన వీధుల్లో వామపక్ష అభ్యర్థుల గెలుపు కాంక్షిస్తూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఖేల్ ఇండియా మహిళల లీగ్ ఖోఖో పోటీల విజేతలకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-కనిగిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఖోఖో సంఘం ఆధ్వర్యంలో కేల్ ఇండియా మహిళల ఖోఖో లీగ్ పోటీలు శనివారం కంచర్లవారిపల్లి ఉన్నత పాఠశాలలో అటహాసంగా జరిగాయి. ఈ పోటీలను హనుమంతుడుపాడు ఎస్ఐ కృష్ణ పావని, రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి మేకల సీతారామరెడ్డి ప్రారంభించగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ కోచ్ మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి విచ్చేసిన వినాయక్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు డిఆర్ ప్రసాద్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ ఖో ఖో పోటీల్లో కనిగిరి ఎంఎస్ఎం కళాశాల జట్టు ప్రథమ స్థానము, కనిగిరి ఎమ్మెస్సార్ జట్టు రెండో స్థానం, కనిగిరి కేజీబీవీ, మొగులూరు జట్టు మూడో స్థానం, నాలుగో స్థానంలో పాతపాడు ఉన్నత పాఠశాల బాలికలు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖో ఖో సంఘం కార్యదర్శి మేకల సీతారామరెడ్డి ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : తూర్పు రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో మద్దిపాడు ఏఎంసి మారేళ్ళ బంగారు బాబు,పోలవరపు శ్రీమన్నా రాయణ, మండల ఎన్నికల పరిశీలకులు గట్టినేని అయ్యన్న, ఉప్పుగుండూరు శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు, పరంధామరెడ్డి, కాటగడ్డ శ్రీనివాసరావు, కోయి హనుమయ్య, బత్తుల కొండయ్య, యోహాను, చంద్రయ్య పాల్గొన్నారు.

ఉద్యమ రథసారథులకు ఓటు వేయండి కార్మిక సంఘాల పిలుపు

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక విద్యార్థి మహిళ సామాన్య రైతు కూలీల సమస్యలు పరిష్కరిం చాలంటే పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అయినా మీగడ వెంకటేశ్వరరెడ్డికి పొక్కిరెడ్డి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఏఐటియుసి సీఐటీయూ నాయకులు సంయుక్తంగా పిలుపు ఇచ్చారు. త్రిపురాంతకం మండలంలోని సీఐటీయూ కార్యాల యంలో విలేకరుల సమావేశం జరిగింది. దేవండ్ల శ్రీనివాస్.బి రఘురామ్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాలైన సమస్యలపై గళ మెత్తుతున్నవారు పిడియఫ్ అభ్యర్థులన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో జి.రాజారామయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు టీడీపీని గెలిపించండి

- డాక్టర్ నూకసాని బాలాజీ

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, దుర్మార్గపు, అవినీతి, దౌర్జన్య వైసీపీని ఓడించాలని, కంచర్ల శ్రీకాంత్, ఎల్.సి రమణారెడ్డిలను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఎమ్మెల్సీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబాయ్ వైయస్ వివేకానంద రెడ్డి హత్య అంశం నుంచి ప్రజల దృష్టి మరలచడానికి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సంస్థపై అవినీతి ఆరోపణలు చేస్తూ అక్రమ అరెస్టులకు తెరలేపారని నూకసాని విమర్శించారు. వైకాపా డైవర్షన్ రాజకీయాలకు పెట్టింది పేరని, ప్రజల దృష్టిని మరల్చడానికే తెలుగుదేశం పార్టీ నేతలపై, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంపై అవినీతి కేసులు పెట్టడం తప్ప వైసిపి ప్రభుత్వం నిరూపించింది శూన్యమని నూకసాని అన్నారు. ప్రజల అన్ని విషయాలు గమనిస్తున్నారని వైసీపీ ప్రభుత్వానికి తగురీతిలో బుద్ధి చెప్తారని నూకసాని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలకు తెరలేపిందని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని విమర్శించారు. తూర్పు రాయలసీమ పట్టబద్దుల టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, ఉపాధ్యాయ అభ్యర్థి ఎల్ సి రమణ రెడ్డిలకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బడుగు బలహీన వర్గాలకు డాక్టర్ నూకసాని బాలాజీ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి మొగల్ కాలేషా బేగ్, కేసన శేషమ్మ పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-వెలిగండ్ల : వైఎస్ఆర్సిపి వెలిగండ్ల మండల నాయకులు ఎర్రబోయిన నాగూర్ యాదవ్ కుమార్తె వైస్ ఎంపీపీ డాక్టర్ ఎర్రబోయిన భారతి వివాహ వేడుకల్లో కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. శనివారం తన స్వగ్రామం వెలిగండ్ల లోని అగ్రహారం గ్రామంలో వారి నివాసం నందు వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సిఎస్ పురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వరునితో వివాహం జరగనుంది. ఈ క్రమంలో వివాహ వేడుకల్లో పాల్గొన్న బుర్ర మధుసూదన్ యాదవ్ వధువుని ఆశీర్వదించి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో కలకాలం జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో జిల్లా జడ్పిటిసి సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరపతిరెడ్డి, ఎంపీపీ దంపతులు రామణ తిరుపతిరెడ్డి, మహాలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ దంపతులు తాతపూడి దేవ సహాయం, మేరీ పుష్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, మండల సచివా లయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం, సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, సర్పంచులు తాతపూడి సురేష్ బాబు, శ్యామల కృష్ణారెడ్డి, దాదా సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శి గంజి రవీంద్రారెడ్డి, గుంటయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ప్రచారం నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ఈ నెల 13వ తేదీన జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పార్టీ తరఫున పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మీ అమూల్యమైన ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని హనుమంతునిపాడు మండల మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి అన్నారు. శనివారం పెద్ద గొల్లపల్లి గ్రామంలో ప్రజలకు కరపత్రాల అందజేశారు. బలరామిరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి భారీ మెజార్టీ రావడం కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హనుమంతునిపాడు మండలంలో పట్టభద్రుల ఓట్లు చాలా వరకు వైసీపీకి అనుకూలంగా ఉన్నాయన్నారు. అలానే గ్రామాల వారీగా వైసీపీ యువ నాయకులు కష్టపడి పనిచేసి వారిని గుర్తించి ఓటు వేసేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో యక్కంటి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇంచార్జ్ కస్తాల బాలాజీ, ఆదినారాయణ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

శీలంవారి వివాహ వేడుకలో పార్ధసారథి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని శీలంవారిపల్లి గ్రామానికి చెందిన శీలం మాలకొండారెడ్డి, కుమార్తె మాధురి వివాహం సందర్భంగా శనివారం పామూరులోని అనిల్ గార్డెన్స్‌లో కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ కదిరి పార్ధసారథి నూతన వధువుని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, మాజీ యంపిటీసీ మునగల నారా యణరెడ్డి, ఉప సర్పంచ్ టి.బాబురావు, షేక్ ఖాజావలి, మునగల సుధాకర్‌రెడ్డి, మునగల శ్రీను, మునగల వెంకటేశ్వర్లు, మామిడేలా మధు, మురం బాబురావు, పెన్నం దామోదర్, నున్నా నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మంత్రి సురేష్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : తూర్పు రాయలసీమలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా త్రిపురాంతకం మండల కేంద్రంలో జరుగుతున్న ప్రచారంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి సురేష్ పాల్గొన్నారు. ముందు మండల కేంద్రంలో వున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటర్లను గడప గడపకు వెళ్లి కలిశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ మొదటి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొంతమంది ప్రవేట్ ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. నాయకులు సమన్వయంతో పని చేయాలని ప్రతి ఒక్క ఓటు తమ పార్టీకే పడేలా చూడాలని నాయకులకు సూచించారు. ఈ కార్య క్రమంలో త్రిపురాంతకం సర్పంచ్ వెంకట లక్ష్మి, యంపిపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల అంజిరెడ్డి, జిల్లా బీసీ నాయకులు అర్ పిచ్చయ్య, మండల పార్టీ కన్వీనర్ పోలిరెడ్డి, కో కన్వీనర్ ఎల్లారెడ్డి, యూత్ నాయకులు కోటీ, యస్సీ సెల్ నాయకులు రాజు, మల్లికార్జున, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-చీమకుర్తి : మండలంలోని అన్ని గ్రామాలలో జగనన్న స్వచ్ఛత భూహక్కు మరియు భూ రక్షా పథకం ద్వారా భూముల రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి అధికారులను ఆదేశించారు. చీమకుర్తి మండలంలోని బండ్లమూడి గ్రామం నందు జరుగుతున్న భూ రీ సర్వే కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వే కార్యక్రమం పనితీరుని ఇంటిని గుర్తించి దోష రహితముగా సర్వే చేయుట ద్వారా సమగ్రమైన సర్వే గుర్తింపు కార్డు వస్తుందని, ఆ హక్కు కార్డ్/ పత్రాల ద్వారా బ్యాంకు రుణ సదుపాయం కల్పించుకొనవచ్చునని, ఈ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించి సర్వేను అత్యంతగా ఖచ్చితత్వంతో పకడ్బందీగా నిర్వహించాలని సర్వేయర్, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అనంతరం సర్వే సిబ్బందితో కలిసి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ మద్దతు ధరకే రబీ ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-తాళ్లూరు : రబి సీజన్లో పండించిన ధాన్యం పంటను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు అన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా శనివారం ఆయన శివరాంపురం గ్రామంలో పర్యటించి వరి కల్లాలను పరిశీలించారు. రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకే రబీ కాలంలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని దీనికంటే అధిక రేట్లకు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసినట్లయితే రైతులు నిర్మొహమాటంగా అమ్ముకోవచ్చని ఆయన తెలిపారు. నాణ్యత ప్రమాణాలను బట్టి ఆర్‌బికేల ద్వారా గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఖరీఫ్ సీజన్లో ఇప్పటివరకు 788.68 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-పెద్దారవీడు : ఎన్నికల కమిషనర్ నియమనిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ పులి రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన సాయంత్రం నాలుగు గంటల నుండి పదమూడో తారీకు మధ్యాహ్నం నాలుగు గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు పూర్తిగా బంద్ చేయాలని, అక్రమంగా బెల్టు మద్యం దుకాణాలు తెరిచి మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పదకొండవ తేదీన మధ్యాహ్నం నాలుగు గంటల నుండి పదమూడోవ తారీకు మధ్యాహ్నం నాలుగు గంటల వరకు పెద్దారవీడు మండల పరిధిలో ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతుంటే సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై పులి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

- అడిషనల్ ఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్ బాబు

విశాలాంధ్ర-పీసీపల్లి : సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఒంగోలు ఆడిషన్ ఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్ బాబు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీస్ శాఖకు సిబ్బందికి సహకరించాలన్నారు. అనవసరంగా గొడవలకు పాల్పడినా, ఓటర్లను ప్రలోభపెట్టినా, బెదిరింపులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఎస్సై ఏ నాగేశ్వరరావుకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు వెంట స్థానిక ఎస్ఐ ఏ నాగేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.

సిస్టర్ విజయరాణికి గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ఆర్‌సీయం పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఏరువ విజయరాణి గౌరవ డాక్టరేట్ పొందటం అభినందనీయమని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుండి జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగం నుండి డాక్టరేట్ పొందిన విజయరాణికి పాఠశాల సిబ్బంది శనివారం అభినందన సభ నిర్వహించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, ఎంఈఓ ఎస్.సాంబశివరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డాక్టరేట్ పొందిన సిస్టర్ విజయ రాణికి అభినందనలు తెలిపి శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వై.అంతోనిదాస్, పుష్పకుమారి, వి.వెంకటేశ్వర్లు, ఎలిజబెత్, నాగరాజు, ప్రమీల, కవిత, జూలియట్, రామయ్య ఉన్నారు.

సీనియర్ న్యాయవాది లంకా మృతి

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది లంకా జయరామయ్య (74) శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని తన కుమారుని వద్ద ఉంటూ చికిత్స చేసుకుంటూ మృతి చెందారు. ఈయన 1973 సంవత్సరం నుండి గిద్దలూరు కోర్టులో న్యాయ వాదిగా పనిచేస్తూ ఏ.జి.పి.గా,ఏ.పి.పి.గా పనిచేయడమే కాక గిద్దలూరు నగర పంచాయతీకి, పలు బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. లంకా జయరామయ్య మృతి పట్ల పలువురు న్యాయవాదులు, రాజకీయ ప్రముఖులు, బంధువులు తమ సంతాపాన్ని తెలిపారు.

పోలీసుల అదుపులో పొగాకు నిందితులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో పొగాకు అపహరణకు పాల్పడుతున్న నిందితులను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ముండ్లమూరు ఎస్సై ఎల్ సంపత్ కుమార్ తెలిపారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన ఎస్సీ రైతు వలేటి పేతురు రెండు రోజుల క్రితం పొలంలో ఏర్పాటు చేసిన 100 పురికొస పొగాకు తాడులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధిత రైతు వలేటి పేతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం తెల్లవారుజామున పులిపాడు సమీపంలో గల రైల్వే బ్రిడ్జి వద్ద ముగ్గురు నిందితులైన ఏ1 కొమ్ముల చిన్న సుబ్బయ్య, ఏ2 గాలిముట్టి వెంకటనర్సు, ఏ3 గాలిముట్టి బాబు వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరు పొదిలికి చెందిన వారని, వీరిని దర్శి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

మన్నేపల్లి చంద్రమౌళి కుటుంబ సభ్యులకు పార్ధసారధి పరామర్శ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్ పురం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షులు మన్నేపల్లి చంద్రమౌళి అకాల మరణం బాధాకరమని కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్ధసారధి అన్నారు. చంద్రమౌళి శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కదిరి పార్ధసారధి శనివారం చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చంద్రమౌళి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంభానికి మనోధైర్యాన్ని కల్పించాలని దేవుణ్ణి ప్రార్ధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి చిన్ని, మన్నేపల్లి సురేష్, రమేష్, సున్నా నారాయణ, చంద్ర, వెంకటేశ్వర్లు (ఆర్.వి), కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, తిరుమలశెట్టి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎస్ఐ ఎల్ సంపత్ కుమార్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా ముండ్లమూరులోని ఆదర్శ పాఠశాలలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కే పూర్ణచంద్రరావు అధ్యక్షతన డ్రగ్స్ మత్తు పదార్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, సుబ్బారావు, జానకి రామయ్య, మల్లేశ్వరరావు, నరసింహా రావు, శ్రీవిద్యా, లక్ష్మీనారాయణ, సుజాత, రమ్యశ్రీ, తులసి, వేణు గోపాలరావు, అశ్విని, హరిబాబు, శివ నాగేశ్వరరావు, గ్రేస్ ఇవాంజలిన్, అనురాధ, రాఘవరావు, వెంకటేశ్వర్లు, చాంద్ భాష, రామారావు, ఎలీషా, శ్రీనివాసులు ఉన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

– ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల పిలుపు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఉద్యోగ కార్మిక ఉపాధ్యాయులు బరుపస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌డి సర్దార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఉద్యోగ వర్గానికి పిలుపునిచ్చారు. స్థానిక సీఐటియు జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులు 2007 నుండి ప్రజాసేవకు అంకితమై పనిచేస్తున్నారు. నీతివంతమైన రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. వీరు సంపాదన కోసం కాకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కౌన్సిల్ వేదికగా పనిచేస్తున్నారు. చట్టసభ లోపల మరియు వెలుపలి ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలబడుతున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, టైం స్కేల్ డైలీ ఉద్యోగులు, తదితరు కోర్కెల పరిష్కారం కోసం ప్రభుత్వంతో రాయబారాలు నడుపుతున్నారన్నారు. ఉద్యోగులు కార్మికులతో కలిసి పోరాటాల్లో పాల్గొంటున్నారన్నారు. ఇటువంటి అభ్యర్థులు గెలిస్తే ఉద్యోగులు కార్మికులకు ప్రయోజనమన్నారు. కావున వీరిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులకు, కష్టజీవులకు, వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్లు ఆమోదించింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదు. విభజన హామీలు అమలు చేయలేదు. విశాఖ స్టీల్ను ప్రైవేటుకరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దు చేయలేదు .కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగాలను పర్మినెంట్ చేయలేదు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. ఇటువంటి సమయంలో మన సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించడానికి మన పోరాటాలకు అండగా నిలబడటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అవసరం ఎంతైనా ఉంది మీడియా సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, అలాగే ఎల్‌ఐసి ఏవోఐ రాష్ట్ర నాయకులు బీ వెంకట్రావు, అలాగే దాచురి రామిరెడ్డి మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకట్రావు, ఏపీఆర్పిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంబాబు, సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

– కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకరరెడ్డి పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకమిటీ సమావేశం నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా ఈదా మాట్లాడుతూరాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంట్ ఆపాదించిన రాష్ట్ర విభజన చట్టం 2014 లోని అంశాలను అన్నింటిని అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్లీనరీ సమావేశంలో ప్రజలకు మాటఇచ్చారన్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మండలాలు, గ్రామాలు, ప్రతి ఇల్లు కార్యకర్తలు తిరిగి ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా సాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చెద్దాం అని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ డి. ఆదినారాయణ రెడ్డి,రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు వుద్దండి మల్లికార్జున రావు, పీసీసీ సభ్యులు రసూల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శి రవి, జిల్లా ఐఎన్‌టియుసి జిల్లా చైర్మన్ ఉంగరాల శ్రీను, మండల ఒంగోలు, కొత్తపట్నం మండల పార్టీ అధ్యక్షులు తెలగలపూడి బుజ్జి, నాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు విద్యావంతులు సిద్ధం

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు విద్యావంతులు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ టిడిపి ఇంచార్జీ ముత్తుముల, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ఎం.ధారు నాయక్‌లు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత నాలుగేళ్ళ వైసీపీ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు అన్నీ రకాలుగా మోస పోయారని జగన్ ప్రభుత్వం అన్నీ వర్గాలను వెన్నుపోటు పొడిచిందని, నిరుద్యోగ యువతకు ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, ప్రభుత్వ ఉద్యోగుల సీపీఎస్ రద్దు ఊసే లేదని, ప్రభుత్వ ఉపాధ్యాయులను రోజుకొక కొత్త పోకడలతో ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వైసీపీ పాలనలో అన్నీ వర్గాల ప్రజలు నష్ట పోయారన్నారు. మార్చి 13వ తేదీన సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు విద్యావంతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేషా వలి, పార్లమెంట్ నాయకులు గోపారపు గోపాల్‌రెడ్డి, షేక్ మహబూబ్ బాషా, 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా రమేష్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పందీటి రజిని బాబు, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు గుర్రం దానియేలు, గోడి ఓబుల్‌రెడ్డి, తెలుగుయువత పార్లమెంట్ కార్యదర్శి సుండీ వెంకట రమణ, మూల వెంకట రామిరెడ్డి, ఖాదర్ వలి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.హరి నారాయణన్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ యం.హరి నారాయణన్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం నందు ఈ నెల 13న జరుగు ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, డిఆర్‌ఓ యన్. రాజశేఖర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలను మంచి ప్రశాంత వాతా వరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించు కొనుటకు అవగాహన నిమిత్తంకు బోర్డ్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. ఈ నెల 12న చిత్తూరు, పలమనేరు, కుప్పం,నగరి ఆర్డీ ఒల పరిధిలో ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఏ దైన గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకు రావాలని, (ఓటర్ ఐడి కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు,పాస్ పోర్టు, పట్టాదార్ పాస్ పుస్తకం, ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఆ శాఖకు సంబంధించిన ఐడి కార్డును) ఏదైన ఒక్కటి గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈనెల 13న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 16న ఆర్ వి ఎస్ లా కాలేజి నందు ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు, ఆర్ వి ఎస్ ఇంజనీరింగ్ కాలేజి నందు పట్టభ ద్రుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోనికి మీడియాకు అనుమతి లేదని, పోలింగ్ కేంద్రం బయట విజువల్స్ తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 13న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్. ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరులలో పట్టభద్రుల ఓటర్లు 3,81,181 మంది.. పురుషులు : 2,45,866 మంది, మహిళలు : 1,35,284 మంది, ఇతరులు:31,పోలింగ్ కేంద్రాలు : 453. ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరులలో ఉపాధ్యాయుల ఓటర్లు 27,694 మంది. పురుషులు : 16,825మంది, మహిళలు : 10,869 మంది, ఇతరులు:0 పోలింగ్ కేంద్రాలు : 176 ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

డీపీఓ నారాయణరెడ్డి

విశాలాంధ్ర-చీమకుర్తి : మండలంలోని బండ్లమూడి గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణరెడ్డి శనివారం తనిఖీ చేశారు. క్లాప్ మిత్రలు ప్రతి రోజు గ్రామంలోని ఇళ్ల వద్ద నుండి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రం వద్దకు తరలించే విధానాన్ని పరిశీలించారు. అనంతరం వర్మి కంపోస్టును తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తొట్టెలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి వాటి ద్వారా కంపోస్టును మొదలుపెట్టేలా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్ డబ్ల్యూ పీసి కేంద్రంలో తీగజాతి మొక్కను నాటారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, గ్రామంలో మురుగు కాలువల పూడిక తీయుట వంటి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ద వహించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని గ్రామాలన్నింటిని పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన అన్నారు. గ్రామాల నందు పారిశుధ్య విషయంలో అలసత్వం వహించరాదని నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శి పైన విస్తరణాధికారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ డబ్ల్యూపీసి షెడ్‌లను పూర్తి స్థాయిలో ఉపయోగంలోనికి వచ్చినప్పుడు గ్రామాలు వ్యర్ధ రహితంగాఉంటాయని, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి, గ్రామ సర్పంచ్, గ్రామ నాయకులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే నా రాజకీయ ప్రయాణం

- పార్టీ మారుతున్నట్లు టీడీపీ అసత్య ప్రచారం
- దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

విశాలాంధ్ర-దర్శి : వ్యక్తిగత కారణాల వల్ల గత కొన్ని నెలలుగా అందుబాటులో లేకపోవడం జరిగిందని దర్శి ఎమ్మెల్యే అన్నారు. శనివారం దర్శి పార్టీ ఆఫీస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గడపగడపకు కార్యక్రమంలో గానీ కార్యకర్తలకు గానీ అందుబాటులో ఉండే వాడిని కానీ ఈ రెండున్నర నెలల్లో అప్పుడప్పుడు నియోజకవర్గంలో కార్యక్రమాల్లో పాల్గొని కొన్ని కారణాల వల్ల పూర్తిస్థాయిలో పాల్గొనలేదు. ప్రస్తుతం వ్యక్తిగత కార్యక్రమాలను ముగించు కోవడంతో ఇకపై పూర్తిస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు. నియోజకవర్గంలో అందుబాటులో లేకపోవడం వల్ల కొన్ని పత్రికలు, చానల్లో పార్టీ మారబోతున్నట్టు వచ్చిన వార్తలు కల్పిత ప్రచారాలని అన్నారు. ఎన్నికల దగ్గర పడుతుండడంతో కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. సీఎం జగన్ ఒక గొప్ప నాయకుడు అటువంటి నాయకుడితో కలిసి నిలబడితే బాధ్యతగా మిగిలినట్టు. అలా నిలబడకుండా తప్పించుకుంటే బాధ్యతలు లేని వ్యక్తులుగా చరిత్రలో నిలుస్తామని ఎమ్మెల్యే అన్నారు. 125 కోట్ల రూపాయలతో సమగ్ర నీటి పథకం ద్వారా నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేసి, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

నారాయణస్వామి సన్నిధిలో దారపనేని, బైరెడ్డి

విశాలాంధ్ర-పామూరు : ప్రకాశం జిల్లా ప్రసిద్ధి చెందిన సిఎస్ పురం మండలం కోవిలంపాడు పంచాయతీ మిట్టపాలెంలో వెలిచి యున్న శ్రీ శ్రీ శ్రీ నారాయణస్వామి సన్నిధిలో కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం వలన ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు లభిస్తాయని భక్తులకు అపారమైన నమ్మకమని, తెలుగు రాష్ట్రాలలో స్వామివారి పేరుమీద ఎన్నో వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నారని, స్వామి వారి కటాక్షము వారిపై ఎల్లవేళలా ఉంటుందని దారపనేని, బైరెడ్డిలు తెలిపారు. నారాయణస్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ జయరెడ్డి స్వామివారి పట్టు వస్త్రాన్ని, స్వామివారి తీర్థప్రసాదాలను దారపనేని, బైరెడ్డి లకు అందజేశారు.

ఉడుముల వారి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బుర్ర

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ఉడుముల వారి వివాహ వేడుకలు శనివారం పొదిలి పట్టణంలోనే సాయి ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి సోదరుడు కొనకనమిట్ల మండలం మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి కుమారుడి వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీటీడీ పాలక మండలి సభ్యులు మరియు కనిగిరి నియోజకవర్గ శాసన సభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ మరియు హనుమంతునిపాడు మండల ఎంపీపీ గాయం సావిత్రిలు కలసి నూతన వధూవరులు స్వరూపరెడ్డి, నిఖితారెడ్డిలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

శీలం వారి వివాహ వేడుకల్లో దారపనేని, బైరెడ్డి

విశాలాంధ్ర-పామూరు : శీలం మాలకొండారెడ్డి రమాదేవి దంపతుల కుమార్తె మాధురి వివాహ వేడుకలు శనివారం స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు పాల్గొని వధువు మాధురిని అక్షింతలతో ఆశీర్వదించారు.

కంచర్ల శ్రీకాంత్, రమణారెడ్డిలను అధిక మెజార్టీతో గెలిపించండి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : తూర్పు రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్‌సి రమణారెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామ క్లస్టర్ ఇంచార్జ్ కసగాల శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 13వ తారీకు జరగబోయేటటువంటి గ్రాడ్యుట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా శనివారం మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కళాశాల, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులని కలిసి, గ్రాడ్యుట్ అభ్యర్థి అయినటువంటి కంచర్ల శ్రీకాంత్‌ని పట్టభద్రులను కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్‌సి రమణారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటుని వేయవలసిందిగా కోరారు. గ్రామ పార్టీ అధ్యక్షులు, కాట్రగడ్డ చంద్రబాబు, బాపట్ల పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి కె సెల్వం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, తెలగతోటి జాన్సన్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు, పొట్లూరి నాగమల్లేశ్వరరావు, జంజనం వెంకటసుబ్బయ్య, బెల్లం శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వర్లు, కొంజేటి రామకృష్ణ, పిన్నిక శ్రీకాంత్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వైసీపీకి ఎమ్మెల్సీ ఓటర్లు బుద్ధి చెప్పాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఈ నెల 13న జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర బాగుపడాలనీ కోరుకునే ప్రతి ఒక్కరూ తెలుగుదేశం బలపరిచిన అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలిపించి అవినీతిలో కురుకుపోయిన వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పాలని ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త సైనికునీలా పనిచేసి మీ గ్రామంలోని ప్రతి ఓటర్‌ని చైతన్యపరిచి తెలుగుదేశం అభ్యర్థి విజయానికి తోడ్పడాలని మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్ కోరారు. శనివారం మండలంలోని నాగులప్పలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు గూడూరు ఝాన్సీ లక్ష్మి, యూనిట్ ఇంచార్జి నెప్పల శివకృష్ణ నియోజకవర్గ కార్యదర్శి కల్లూరి రవిబాబు, పాల కేంద్రం మాజీ డైరెక్టర్ చుండూరి నాగేశ్వరావు, పార్టీ నాయకులు స్వర్ణ కిషోర్ బాబు, చావ శేఖర్ బాబు, మున్నంగి వెంకయ్య, పోలినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

104 వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం 104 వాహనం ద్వారా గ్రామాలలోని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఉమ మహేశ్వరపురం గ్రామంలోని డాక్టర్ వైయస్సార్ హెల్త్ క్లినికల్ వద్ద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే మీ దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గాని, మీ గ్రామాల్లోని వైయస్సార్ హెల్త్ క్లినికల్ వద్ద గాని వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో 210 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 80 మందికి షుగర్ పరీక్షలు 88 మందికి బీపి పరీక్షలు, జలుబు దగ్గు జ్వరాలు ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. సిహెచ్‌ఓ జయశ్రీ, డిఈఓ వెంకట ప్రసాద్, ఆశాలు నర్మదా, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

– మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని

విశాలాంధ్ర-బేస్తవారిపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తూర్పు రాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేయుచున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ పెర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డిలకు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం స్థానిక దరగా కొండపైన గల కల్యాణ మండపంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు నాయకత్వంలో గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశం బేస్తవారిపేట ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తర్వాత గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు అన్నా రాంబాబుకు రెండో అత్యధిక మెజారిటీ ఇచ్చారని, అదే ఉత్సాహంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేసి, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ చెక్కు చెదరలేదని నిరూపించాల్సిన బాధ్యత నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి గిద్దలూరు అంటే ఇష్టమని, గతంలో కడపకు వెళ్ళేటప్పుడు ఎన్నోసార్లు గిద్దలూరులో ఆగి వెళ్ళేవారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, గిద్దలూరు నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.